స్పీడ్ పెంచిన కాంగ్రెస్


అంజన్‌కుమార్‌యాదవ్‌ను ఆశీర్వదిస్తున్న పాస్టర్లు


గాంధీనగర్‌లో అంజన్‌కుమార్‌యాదవ్‌కు మద్దతుగా గుర్రం శంకర్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతున్న అంజన్, అనిల్, అరవింద్

ముషీరాబాద్ : ముషీరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో స్పీడ్ పెంచింది. ఒక వైపు అంజన్ ఇంటింటి పాదయాత్ర నిర్వహిస్తుండగా ఆయన ఇద్దరు కుమారులు, డీసీసీ అధ్యక్షులు అనిల్‌కుమార్ యాదవ్, అరవింద్ యాదవ్‌లు కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. దీనికి తోడు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కాంగ్రెస్ అగ్రనేతలు కార్నర్ మీటింగ్‌లలో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరుగుతున్నారు. గురువారం పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో పర్యటించనున్నారు.

క్రిస్టియన్ సంఘాల మద్దతు...

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే క్రిస్టియన్ మైనార్టీలకు రక్షణ ఉంటుందని, సెక్యులర్ పార్టీ కాంగ్రెస్‌ను గెలిపించేందుకు క్రిస్టియన్ మైనార్టీలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ కోరారు. బుధవారం గోల్కొండ చౌరస్తాలోని ఎంబి చర్చి కోశాధికారి జాన్ కెనడి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 48 చర్చిల పాస్టర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న పాస్టర్లందరు అంజన్‌కుమార్‌యాదవ్‌ను ఆశీర్వదించి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. సమావేశానికి గౌరవ అతిథిగా క్రిస్టియన్ మైనార్టీ సెల్ జాతీయ వైస్ చైర్మన్ అనిల్ థామస్ హాజరయ్యారు.

రెడ్డి సంఘం నాయకుల మద్దతు...

ముషీరాబాద్ నియోజకవర్గంలోని రెడ్డి కులస్తుల సంక్షేమానికి పాటుపడతానని అంజన్‌కుమార్‌యాదవ్ తెలిపారు. అంజన్‌కుమార్‌యాదవ్‌కు మద్దతుగా ముషీరాబాద్ నియోజకవర్గం రెడ్డి సంఘం నాయకులు నల్లవెల్లి అంజిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం బాకారంలో సమావేశం నిర్వహించారు.

ఈసారి కాంగ్రెస్ విజయం ఖాయం


బాగ్ అంబర్‌పేట సోమసుందర్‌నగర్‌లో ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ సి.రోహిణ్ రెడ్డి

అంబర్‌పేట్: సుదీర్ఘకాలం అనంతరం అంబర్‌పేట్‌లో కాంగ్రెస్ జెండా ఎగరబోతోందని ఆ పార్టీ అభ్యర్థి రోహిణ్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం బాగ్ అంబర్‌పేట డివిజన్ సోమాసుందర్‌నగర్, ఎస్‌బీఐ కాలనీ తదితర ప్రాంతాల్లో పార్టీ శ్రేణులతో కలిసి ముమ్మర ప్రచారం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాబోతోందని అంబర్‌పేటలో సహితం కాంగ్రెస్ పార్టీ గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. అంబర్‌పేటలో ఓటు వేసి ఒక్క అవకాశం ఇస్తే సమగ్రాభివృద్ధికి పాటు పడుతానన్నారు. కాంగ్రెస్ కనుక వస్తే ఆరు గ్యారంటీలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. అనంతరం వ్యక్తిగతంగా ఓటర్లను ప్రత్యేకంగా కలుస్తూ గెలుపే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

గెలిపిస్తే అందుబాటులో ఉంటా

అంబర్‌పేట్: నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ అభ్యర్థి కాలేరు వెంకటేష్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గత ఐదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి కృషిచేశారన్నారు. బుధవారం అంబర్‌పేట డివిజన్‌లోని బాపునగర్, చెన్నరెడ్డినగర్, ఓవైసీ నగర్ తదితర ప్రాంతాల్లో స్థానిక బీఆర్ఎస్ కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్‌తో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు, అభివృద్ధి రెట్టింపు అవుతుందన్నారు. గత ఐదేళ్లలో స్థానికంగా నిత్యం అందుబాటులో ఉండి ప్రజలకు అన్ని విధాల అండగా ఉన్నానని, గెలిస్తే మరింత ప్రజలకు చేరువవుతానని చెప్పారు.


బాపునగర్‌లో ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్


నగరంలో బీజేపీ ఓబీసీ జాతీయ కన్వీనర్, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్‌ను బుధవారం బీజేపీ జాతీయ కార్యదర్శి జీవీ మణి మారన్, రాష్ట్రీయ లోక్‌జనశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీమారావు తదితరులు కలిశారు. మర్యాదపూర్వకంగా శాలువాలతో సన్మానించారు. -సాక్షి, సిటీబ్యూరో

హరివిల్లు కవితా సంకలనాల ఆవిష్కరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పలువురు రచయితలు రచించిన హరివిల్లు కవిత సంకలనాలను బుధవారం ఆవిష్కరించారు. అష్టదల పద్మాలు, అక్షర విరజల్లు, మానస మాణిక్యాలు, పూర్ణచంద్రిక తదితర సంకలనాలను ఆవిష్కరించారు. ప్రముఖ సాహితీవేత ఏనుగు నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ సమాజంలో చైతన్యం తీసుకురావడానికి ఇలాంటి సంకలనాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. డాక్టర్ నోరి రాజేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సాహితీవేతలు మామిడి రమేష్, వీటిఆర్ మోహన్‌రావు, చిట్టి మధుసుధన్‌రావు పాల్గొన్నారు.

నాసా పోటీలకు ఎంపికైన శ్రీచైతన్య విద్యార్థులు

కాచిగూడ: నాసా నిర్వహించిన అంతర్జాతీయ స్పేస్ సెటిల్మెంట్ పోటీలలో బర్కత్‌పురలోని శ్రీ చైతన్య విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బుధవారం స్కూల్ విద్యార్థులకు నాసా కిట్లను పంపిణీ చేశారు. ఓయూ అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ పి.హిమబింద పాల్గొని విద్యార్థులను అభినందించారు.

డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే జైలుకే

● ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే జైలుకే పోవాల్సి వస్తుందని ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు. యువత ట్రాఫిక్‌నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. బుధవారం చిక్కడపల్లిలోని న్యూఎరా జూనియర్ కళాశాలలో రోడ్డు ప్రమాదాలు, నివారణ అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యూఎరా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శ్రావణ్‌కుమార్, చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరేశం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపకాలను అరికట్టాలి

● 'గవర్నర్‌ను కోరిన ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక

కాచిగూడ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు డబ్బు, మద్యం పంపకాలతో ఓటర్లను ప్రలోభపెట్టకుండా చర్యలు తీసుకోవాలని పలువురు సీనియర్ జర్నలిస్టులు, ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక ప్రతినిధులు రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్‌ను కోరారు.రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు, ఎన్నికల సందర్భంగా పాత్రికేయులపై జరుగుతున్న దాడులు, ఇతర నిఘా విషయాలపై వారు గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లారు. పాశం యాదగిరి, కే.కోటేశ్వర్ రావు, అనంచిన్ని వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం ద్వారానే అభివృద్ధి సాధ్యం

కాచిగూడ: రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మున్నూరుకాపులు అభివృద్ధికి నోచుకోక నేటికి అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్ రావు అన్నారు. బుధవారం కాచిగూడలోని మున్నూరుకాపు మహాసభ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు మున్నూరుకాపులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే పరిగణిస్తున్నారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయాలకు అతీతంగా వివిధ పార్టీ నుండి పోటీ చేస్తున్న మున్నూరుకాపు నాయకులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

గేరు మార్చిన బీఆర్ఎస్


స్కూటర్ మెకానిక్‌ల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ముఠా గోపాల్


ముషీరాబాద్ చేపల మార్కెట్‌లో ప్రచారం చేస్తున్న ముఠా జైసింహ

● దూకుడుగా ఎన్నికల ప్రచారం
● ఉత్సాహం నింపుతున్న ముఠా గోపాల్, ముఠా జైసింహలు

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఆయన కుమారుడు ముఠా జైసింహలు నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృతంగా పర్యటిస్తు పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతున్నారు.

చేపల మార్కెట్‌లో విస్తృత ప్రచారం...

ముషీరాబాద్ డివిజన్ చేపల మార్కెట్‌లో ముఠా జైసింహ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి వ్యాపారస్తుడి దగ్గరకు వెళ్లి ముఠా గోపాల్‌కు మద్దతు ఇవ్వాలని, కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

స్కూటర్ మెకానికల్‌ల మద్దతు...

ముషీరాబాద్ నియోజకవర్గంలో గల స్కూటర్ మెకానిక్‌లు ముషీరాబాద్ చౌరస్తాలోని మహ్మదీయ ఫంక్షన్‌హాల్‌లో ముఠా గోపాల్‌కు మద్దతుగా ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సమ్మేళనానికి బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్, ముఠా జైసింహ హాజరై స్కూటర్ మెకానిక్‌ల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు ముఠా గోపాల్‌కు మెకానిక్‌లు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

సంగిశెట్టి జగదీష్ ప్రచారం...

ఇటీవల కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన సంగిశెట్టి జగదీష్ నియోజకవర్గంలో విస్తృతంగా ముఠా గోపాల్‌కు మద్దతుగా ప్రచారంలో పాల్గొన్నారు. ముషీరాబాద్ డివిజన్‌లోని బాపూజీనగర్‌లో అడిక్‌మెట్ డివిజన్‌లోని గణేష్‌నగర్‌లో ఎన్నికల ప్రచారంలో ముఠా గోపాల్‌తో కలిసి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సెంట్రల్ కార్యాలయం ప్రారంభం...

ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన సెంట్రల్ ఎన్నికల కార్యాలయాన్ని పార్టీ అభ్యర్థి ముఠా గోపాల్, ముఠా జైసింహలు బుధవారం సాయంత్రం ప్రారంభించారు.